రేపు కుప్పంలో 7 పరిశ్రమలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల్లో 7 పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో 8వ తేదీ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. కుప్పం ప్రాంత పారిశ్రామిక వికాసం దిశగా ప్రగతి పథంలో ముందడుగులో భాగంగా రూ.2,203కోట్ల పెట్టుబడితో దాదాపు 22వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు రానున్నాయి. గత నెల 28న సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన చేయాల్సి ఉండగా తుపాను నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. 8వతేదీ కుప్పం మండలం పలార్లపల్లి వద్ద అలీఫ్, అనిమిగానిపల్లి సమీపంలో ఆదిత్య బిర్లా, శాంతిపురం మండలం తంబిగానిపల్లి వద్ద మదర్ డెయిరీ, రామకుప్పం మండలం విజిలాపురం వద్ద ఈరైస్, గుడిపల్లి మండలం పొగురుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఏసీఈ, శ్రీజ డెయిరీ, ఎస్‌విఎఫ్ సోయా పరిశ్రమలకు సీఎం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.

జనావాసాల్లోకి వన్యమృగాలు

- గజదాడుల్లో పంట నష్టపోతున్న రైతులు
- భయాందోళనలో అటవీ సమీప ప్రాంతాల ప్రజలు

ఐరాల మండలంలో చిరుత పులి సంచరిస్తున్న ఆనవాళ్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో వన్యమృగాలు అటవీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఏనుగుల దాడుల్లో వందలాది ఎకరాలు పంట పొలాలు నాశనం కావడంతో పాటు ప్రాణనష్టం చోటు చేసుకుంటుంది. గతేడాది గుడిపాల మండలంలో ఒంటరి ఏనుగు సృష్టించిన బీభత్సం అంతా ఇంత కాదు. వ్యవసాయం చేసుకుంటున్న దంపతులపై దాడిచేసి చంపేయడంతో పాటు ఓ యువకుడుపై దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. కల్లూరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారంతో అక్కడి రైతులు వణికిపోయారు. ఇక పలమనేరులో ఏనుగుల సంచారం పెరగడంతో అటవీ సమీప ప్రాంతాల్లో వ్యవసాయ భూముల వైపు వెళ్లేందుకు రైతులు భయపడాల్సి వస్తోంది.

జిల్లాలోని అటవీ సమీప ప్రాంత గ్రామాల్లో ఏనుగుల సంచారం బాగా పెరిగింది. పలమనేరు గంట ఊరు వద్ద ఓ ఒంటరి ఏనుగు దాడిలో అటవీశాఖ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. ఇలా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నా అటవీ శాఖ అధికారులు ఏనుగులను నియంత్రించడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ అటవీ పరిసర ప్రాంతాల గ్రామాల రైతుల నుండి విమర్శలు ఎదుర్కొంటున్నారు.

ఈ క్రమంలో బుధవారం రాత్రి ఐరాల మండలం వడ్రంపల్లి గ్రామపరిసరాల్లో చిరుత పులి సంచారంతో పరిసర గ్రామాల్లోని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం రాత్రి ఐరాల మండలం వడ్రంపల్లి గ్రామ సమీప పంట పొలాల్లో సంచరించిన చిరుత కిషోర్ కుమార్ అనే రైతు పొలం వద్ద దూడను చంపివేసింది.

వడ్రంపల్లి అటవీ సమీప ప్రాంతంలో పులి దాడిలో మృతి చెందిన దూడ

ఈ ఘటనతో ఐరాల అటవీ పరిసర ప్రాంతాల గ్రామస్తులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం పలమనేరు, యాదమరి, బంగారుపాళ్యం, గుడిపాల, కల్లూరు అటవీ ప్రాంతాల్లో 100కు పైగా ఏనుగులు సంచరిస్తున్నట్లు సమాచారం. పంట పొలాలపై ఏనుగులు దాడులను అరికట్టేలా కర్ణాటక, తమిళనాడు తరహాలో అటవీ పరిసర ప్రాంతాల్లో సోలార్ కంచె ఏర్పాటు చేయాలని ఎప్పటినుండో అటవీ సమీప ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మరోవైపు ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోతున్నారు రైతులకు 10 శాతానికి మించి నష్టపరిహారం చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి, బంగారుపాలెం, ఐరాల మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భయాందోళన ఘటనలని నివృత్తి చేసి ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన అటవీ శాఖ అధికారులు నామమాత్రంగా ఎవరు చెబితేనే, ప్రచార మాధ్యమాల్లో సమాచారం తెలిస్తే కానీ కనీసం వారి విధులు నిర్వహించకపోవడం ఇందుకు ప్రధాన కారణం. గత కొన్ని నెలలుగా తవణంపల్లి మండల పరిసర అటవీ ప్రాంతాల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయి. పంట పొలాలపై పడి ఏనుగులు నాశనం చేస్తున్నాయి. గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు అటవీ సమీప ప్రాంత గ్రామాల ప్రజలకు వన్యమృగాల దాడుల నుండి ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఈనెల 8, 9 తేదీల్లో డిప్యూటీ సీఎం, అటవీ పర్యాటక శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. 9వ తేదీ చిత్తూరు జిల్లాలోని పలమనేరు వద్ద కుంకీ ఏనుగు సంరక్షణ, ఏనుగుల దాడుల నుండి పంట పొలాలను ప్రజలను కాపాడుకుంటూ అటవీ శాఖ ఎలాంటి అప్రమత్తమైన చర్యలు తీసుకోవాలని విషయంపై చర్చించనున్నారు. జిల్లా పర్యటనకు రానున్న డిప్యూటీ సీఎం, అటవీ పర్యాటక శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ జిల్లాలో ఏనుగుల దాడులు, చిరుత పులుల సంచారంపై అటవీ శాఖ ద్వారా ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు వేచి చూడాల్సిందే..

మొరవెత్తుతున్న చెరువులు..

- బలహీనంగా ఉన్న కట్టలు
- అధికారుల అప్రమత్తత అత్యవసరం

ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఈ తరుణంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ఎలాంటి ఉపయోగం ఉండదన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. తిరుపతి జిల్లాలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చిత్తూరు జిల్లా ఇరిగేషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజాశక్తి- పూతలపట్టు: తిరుపతి జిల్లా కెవిబి పురం మండలంలోని పాతపాలెం వద్ద గల ఓలూరు రాయల చెరువుకు గండి పడడంతో గ్రామాలు నీటమునిగి అనేక మూగజీవాలు కొట్టుకుపోవడంతోపాటు అధిక సంఖ్యలో పశువులు మృత్యువాతపడ్డాయి. దాదాపు ఐదు గ్రామాలు జలవలయంలో దిగ్బంధమయ్యాయి. అక్కడి ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి చెట్లు, మిద్దెలు ఎక్కాల్సిన పరిస్థితి. ప్రస్తుతం కూడుగుడ్డకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో చిత్తూరు జిల్లాలోని అనేక చెరువుల కింద కూడా పలు గ్రామాలు ఉన్నాయి. ఇలాంటి పెద్ద చెరువులకు గండి పడితే తిరుపతిలో జరిగిన సంఘటనలే జిల్లాలోనూ పునరావృతం అయ్యే అవకాశాలు అత్యధికంగా కనబడుతున్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా చెరువులు పూర్తిస్థాయిలో నీటితో నిండి కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా ఇరిగేషన్‌కు సంబంధించిన పెద్దచెరువులపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో పరిస్థితి..

చిత్తూరు జిల్లాలో సుమారు 4,122 చెరువులు ఉన్నాయి. ఇందులో సుమారు 15 చెరువుల కింద పలు గ్రామాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అక్టోబర్ నెలలో కురిసిన వర్షాలకు చాలా వరకు చెరువులు పూర్తిగా నిండి ఉండగా, మరికొన్ని 70 నుంచి 90 శాతం నీటి నిల్వతో జలకళను సంతరించుకున్నాయి. కానీ ప్రస్తుతం అనేక చెరువుల కట్టలు బలహీనంగా దర్శనమిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ఆయకట్టు రైతులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాలుగా చెరువు కట్టల మరమ్మతులు చేపట్టకపోవడంతో కట్టలు బలహీనంగా మారడంతోపాటు బీటలువారుతున్నాయి. కొన్ని మండలాల్లో చెరువు కట్టలకు గండిపడటం, నీటి ఉధృతికి రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయి రాకపోకలు సైతం స్తంభించడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

అధికారులు గుర్తిస్తున్నారు..

వెంకటేశ్వర రాజు, చిత్తూరు జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ

మండల స్థాయిలోని ఇరిగేషన్ ఏఈలు ఆయా మండలాల్లో ఉన్న చెరువులను పరిశీలిస్తూ ప్రమాదాలను గుర్తించే పనిలో ఉన్నారు. ముఖ్యంగా కొన్ని చెరువు కట్టలపై తారు రోడ్లు నిర్మించి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి చెరువులే కొద్దిపాటి ప్రమాదాల్లో ఉన్నాయి. అయినప్పటికీ వాటిని గుర్తించి తగి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా అధికారులకు సహాయ సహకారాలు అందించాలి. చెరువులు గండి పడే పరిస్థితుల్లో ఉంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

వీడని వర్షం

చిత్తూరు అర్బన్: ఏడతెరిపిలేని వానలు, తుపానుతో చిత్తూరు జిల్లా తడిసి ముద్దవుతోంది. చిత్తూరు జిల్లా గురువారం జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలు జిల్లా ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. గత నెల వానలతో పంటలు నష్టపోయిన రైతాంగం తిరిగి మూడు రోజులు పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు.

జిల్లాలో గురువారం అత్యధికంగా గుడిపాల మండలంలో 53.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పుంగనూరు 1.0 మి.మీ నమోదు కాగా 8 మండలాల్లో ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. అలాగే చిత్తూరు రూరల్ 50, విజయపురం 41.6, జీడీ నెల్లూరు 31.2, యాదమరి 29.6, పూతలపట్టు 26, నగరి 23, పులిచర్ల 16.2, పెనుమూరు 13.8, నింద్ర 10.5, శాంతిపురం 8.2 , తవణంపల్లి 8.2, గంగవరం 7.4, బంగారుపాలెం 06, చిత్తూర్ అర్బన్ 04 ,గుడిపల్లి 04, పలమనేరు 3.4 వీకోట 3.2 చౌడేపల్లి 03, సదుం 2.2 పెద్దపంజాణి 1.2 సోమల 1.2 పుంగనూరు 01. జిల్లా మొత్తంగా 353.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కుంగిన యాదకుంట చెరువు కట్ట

- గండి పడే ప్రమాదంతో ఆందోళన
- తక్షణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

ప్రజాశక్తి- వి.కోట : మండల పరిధిలోని బైరపల్లి పంచాయతీ యాదకుంట చెరువుకట్ట మరోసారి కుంగింది. చెరువు కట్టపై రోడ్డు వేసేటప్పుడు సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల తుపాను వలన కురిసిన వర్షాలకు వారంరోజుల క్రితం చెరువు కట్ట మధ్యలో లీకేజీకి గురై కట్ట కుంగింది. దీంతో ఎక్కడ కట్ట తెగిపోతుందో అని స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖ అధికారులు తాత్కాలికంగా చెరువు మొరవ వద్ద రోడ్డు తొలగించి చెరువులోని నీటిని దిగువకు విడిచారు. గండిపడిన చోట లీకేజీ గురి కాకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ట్రాక్టర్లతో మట్టిని తోలి రింగ్బండ్ కట్ట దిగువ వైపు వేశారు. ఇదే ప్రకారం నీరున్న వైపు రింగ్బండ్ వేసి ఉంటే లీకేజీ గురి అయ్యేది కాదని తెలుస్తోంది. అయితే బుధవారం కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి నీరు చెరువుకు చేరడంతో మళ్లీ కట్టమధ్య భాగంలో కుంగి రోడ్డు కోతకు గురై యథాప్రకారం లీకేజీకి గురైంది. కట్ట మధ్యభాగం గండి పడే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో మరోమారు యాదుకుంట గ్రామానికి ప్రధాన రహదారి నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెరువు కట్ట సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ గజేంద్ర చెరువు కట్టను పరిశీలించారు. పదేపదే చెరువు కట్ట కుంగిపోతున్న సంబంధిత అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, చెరువు కట్టను బలోపేతం చేసి యాదకుంట గ్రామానికి రాకపోకలకు అంతరాయ లేకుండా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువు కట్టను పరిశీలిస్తున్న రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర

సోషలిజమే ప్రత్నామ్యాయం

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- పలమనేరు: ప్రపంచంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోషలిజమే ప్రత్నామ్యాయ మార్గమని సోషలిజం గురించి ప్రస్తుత తరానికి అర్థం కావాలని దీనికోసం సిపిఎం విస్తృతంగా రకరకాల కార్యక్రమాలతో ప్రచారం చేస్తున్నదని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తెలిపారు. అందులో భాగంగానే గురువారం పలమనేరు డిగ్రీ కాలేజ్ వద్ద విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే సదస్సులు చర్చాగోష్టులు సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మతోన్మాద బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని మనువాదాన్ని తీసుకొస్తామని చెప్పుతూ ప్రజలను మభ్యపెడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల అభివృద్ధి అంటే పెద్దపెద్ద మేడలు కాదని పేదల ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి అయినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు. అటువంటి అభివృద్ధి సిపిఎం నేతృత్వంలోని కేరళ రాష్ట్ర ప్రభుత్వం పేదరికం నిర్మూలించిన ఘనత కమ్యూనిస్టులకు సాధ్యమైందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా ఇంకా దేశంలో, ఇతర రాష్ట్రాల్లో పేదరికం ఎందుకు నిర్మూలించలేదని ప్రశ్నించారు. సోషలిస్టు విప్లవం స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో సోషలిజం వైపు ప్రజల ఆలోచిస్తున్నారని దేశంలో కూడా అలాంటి ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్త, ఓబుల్ రాజు, నాయకులు లక్ష్మయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఎదుట మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

9న డిప్యూటీ సీఎం పర్యటనపై సమీక్ష

ప్రజాశక్తి- పలమనేరు

ఈనెల 9న చిత్తూరు జిల్లాలోని పలమనేరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు. 9వ తేదీ ఆదివారం డిప్యూటీ సీఎం తిరుపతి నుంచి పలమనేరుకు చేరుకున్న అనంతరం షెడ్యూల్ మేరకు చేపట్టనున్న కార్యక్రమాల వివరాలను అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. 9న ఉదయం 10 గంటలకు ముసలిమడుగు సమీపంలోని హెలిపాడ్ వద్దకు చేరుకున్న డిప్యూటీ సీఎంకు గజమాలతో స్వాగత ఏర్పాట్లు చేసినట్లు ఎఫ్ఆర్వో నారాయణ వివరించారు. అనంతరం శిలాఫలకం ప్రారంభోత్సవం ఎలిఫెంట్ ఎన్క్లోజర్స్‌లో ఏనుగుల విన్యాసాలు వీక్షించిన తర్వాత మావటిలు సిబ్బందితో చర్చిస్తారని, అక్కడినుంచి ఎలిఫెంట్ క్రాల్ సందర్శన, అకిరామియా ప్లాంట్లో చెట్లు నాటడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం రైతులతో రచ్చబండ కార్యక్రమం చివరగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేయనున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే వారి కార్యాలయంలో చిత్తూరు రూరల్, అర్బన్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలు వేగంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. భూమి సమస్యలపై రైతులు, ప్రజల నుంచి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, అర్జీలపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పరిష్కరించాలన్నారు. సర్వేయర్లు, వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్, డీటీ ఇబ్రహీం, ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చెరువు మొరవను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు రూరల్ మండలం వెంకటప్పనాయుడు చెరువు మొరవ నీటి ప్రవాహాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వెంకటప్ప నాయుడు చెరువు నిండి మొరవ నీరు ఉధృతిగా ప్రవహించడంతో.. మధ్యలో పంట పొలాలు మీదుగా ఏనుగుంటపల్లి గ్రామంలో నివాసాల వద్దకు చేరింది. మార్గమధ్యంలో రహదారులపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. దీంతో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం సాయంత్రం వెంకటప్ప నాయుడు చెరువు మొరవను పరిశీలించారు. నీటి మునిగిన పంట పొలాలను, దారులను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. మొరవనీరు పంట పొలాలు, ఇళ్లలోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ కృష్ణమూర్తి, తెదేపా నాయకులు కాజూరు బాలాజీ, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వంకలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలో కొత్తపల్లి మిట్ట, వివి.పురం, వేణుగోపాలపురం, పుల్లూరు, గంగాధర నెల్లూరు మండలంలో ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు పుల్లూరు పెద్దవంక, పాపిరెడ్డిపల్లి వంక, పాతపాలెం, గిడ్డమాకరాజపురం వంక తో పాటు పలు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ లోకనాథ పిళ్ళై తెలిపారు. గురువారం ఉధృతంగా ప్రవహిస్తున్న వంకలలో నీటి ప్రవాహాన్ని తహశీల్దార్ పరిశీలించారు. ఎగువన కురిసిన వర్షాలకు వరద నీరు వచ్చి చేరడంతో వంకల్లో నీటి ప్రవాహం పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలకు పశువులు, ఆస్తి నష్టం జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

పార్క్ చేస్తే ఫీజు చెల్లించాల్సిందే..

- ప్రభుత్వ ఆసుపత్రిల్లో మళ్లీ వసూళ్లు మొదలు
- బయటే వాహనాలు పెడుతున్న ప్రజలు, రోగులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి చాలా మంది రోగులు ఉచిత వైద్యం కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సైతం వస్తుంటారు. ఆసుపత్రికి వాహనాల్లో వెళ్లాలంటే పార్కింగ్ ఫీజు చెల్లించుకోవాల్సిందే అంటూ బ్యానర్లు కట్టి పెట్టడంతో గేటు బయటనే వాహనదారులు వాహనాలను పార్క్ చేసి లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి. ఆటోలు సైతం ఫీజులు చెల్లించాలని హుకుం జారీ చేయడంతో లోపలికి రాకుండా గేటు వద్దే రోగులును వదిలి వెళుతున్నారు ఆటో డ్రైవర్లు.. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో పార్కింగ్ ఫీజును రద్దు చేయాలంటూ వామపక్ష పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, దళిత సంఘాల పోరాటం చేయగా దాని ఫలితంగా రెండేళ్ల క్రితం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగుల నుండి వాహనాల పార్కింగ్ ఫీజు చెల్లింపులను రద్దు చేసింది. అయితే ప్రస్తుతం ఆ వసూళ్లు మళ్లీ మొదలయ్యాయి.

ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన గేటు ముందు ఏర్పాటు చేసిన బ్యానర్

ప్రభుత్వ ఆసుపత్రిలో వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు వారం రోజుల క్రితం నుండి తిరిగి ప్రారంభమయ్యాయి. ద్విచక్ర వాహనానికి రూ.5, కారు, ఆటో ఇతర వాహనాలకు రూ.10లు చొప్పున పార్కింగ్ ఫీజును వసూలు చేస్తున్నారు. పార్కింగ్ ఫీజు వసూలు కోసం నగరపాలక సంస్థ టెండర్ను గోపి అనే వ్యక్తి రూ.12 వేలకు తీసుకోవడంతో గత వారం రోజుల నుండి ప్రభుత్వ ఆసుపత్రి పార్కింగ్ ఫీజు వసూళ్లు ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులు గతంలో ఇన్ పేషెంట్ విభాగం, అత్యవసర విభాగ భవనాల వద్దకు వచ్చి రోగులను ఆటోలో ఎక్కించుకు వెళుతున్న ఆటోవాలాలు పార్కింగ్ ఫీజుతో ప్రధాన గేటు వద్దే ఆటోలు ఆపి ఎక్కించుకోవడంతోపాటు అక్కడే వదులుతున్నారు దీంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉచిత వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్న పేదల నుండి పార్కింగ్ ఫీజు పేరుతో డబ్బులు వసూలు చేయడానికి రోగులు, సహాయకులు ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నగర అభివృద్ధిని కోరుకునే సంస్థలు, ప్రజాసంఘాలు ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా ఉన్నఫలంగా పార్కింగ్ ఫీజు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉచిత వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్న వారి నుండి పార్కింగ్ ఫీజు వసూలు రద్దు చేయాలని కోరుతున్నారు.

పార్కింగ్ భయంతో గేటు వద్దే రోగులను ఎక్కించుకుంటున్న ఆటో డ్రైవర్లు

పార్కింగ్ ఫీజ్‌ను వెంటనే రద్దు చేయాలి

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

ఉచిత వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పేదల నుండి పార్కింగ్ పేరుతో డబ్బులు వసూలు చేయడం అత్యంత దారుణం. టెండర్ను రద్దుచేసి ప్రభుత్వ ఆసుపత్రిలోకి వాహనాలను ఉచితంగా అనుమతించాలి. రోగులను ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేసిన వ్యక్తులు కనీసం నాలుగైదు సార్లు మందులు, భోజనం ఇతర అవసరాల కోసం వాహనంలో ఆసుపత్రి బయటికి వెళ్లి రావాల్సి ఉంటుంది. ప్రతిసారి పార్కింగ్ ఫీజులు చెల్లించాలంటే ద్విచక్ర వాహనదారుడు రోజుకు రూ.25 నుండి 30లు పార్కింగ్ ఫీజుకే చెల్లించాలి. ఆటో ఇతర వాహనాలు అయితే రూ.50లకు పైగా చెల్లించాల్సి వస్తుంది. ఆటోలు ఇతర వాహనాలు ఆసుపత్రిలోకి రాకపోతే రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వెంటనే పార్కింగ్ ఫీజును రద్దు చేయాలి లేకుంటే ప్రజాఉద్యమం చేపట్టాల్సి వస్తుంది.

అన్నదానం ట్రస్టుకు రూ.36 లక్షలు విరాళం

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నూతన అన్నదాన భవనంకు, నూతనంగా కుకింగ్ స్టీమింగ్, బాయిలర్ కిచెన్ ప్లాంట్‌కు దాత బెంగళూరుకు చెందిన మురళీకృష్ణ, మహేశ్వరి, వారి కుటుంబ సభ్యులు రూ.36లక్షలు విరాళంగా అందించారు. గురువారం దేవస్థానం ఈవో పెంచల కిషోర్‌కు విరాళం చెక్కును దాతలు అందజేశారు. అనంతరం దాలకు స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

దాతకు స్వామివారి తీర్థప్రసాదాలు అందిస్తున్న ఈవో

ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయం మార్పు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: పరిపాలనపరమైన కారణాల దృష్ట్యా ప్రస్తుతం చర్చి వీధిలో నిర్వహించబడుచున్న దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వారి కార్యాలయం సంతపేటకు మార్పు చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుండి సంతపేట రోడ్డులోని రాగిమాను వద్ద దేవదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ కార్యాలయ మార్పును గమనించాలని కోరారు.

15న ఎక్సైజ్ వాహనాల వేలం

ప్రజాశక్తి - విజయపురం (నగరి): వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 15వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసులు రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో స్ప్లెండర్ రిజిస్ట్రేషన్ కలిగినవి ఒకటి, రిజిస్ట్రేషన్ లేనివి ఒకటి, హోండాడియో స్కూటీ రిజిస్ట్రేషన్ లేనిది ఒకటి, హీరో హోండా స్ప్లెండర్ రిజిస్ట్రేషన్ కలది ఒకటి వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరలో 10శాతం ధరావత్తు సొమ్మును ముందుగా చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్నవారు చలానాతో పాటు జీఎస్టీ చెల్లించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. అలా చేయకుంటే కట్టిన ధరావత్తు వదులుకోవాలని అది ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందన్నారు. వేలంలో వాహనం దక్కని వారికి ధరావత్తు సొమ్మును తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనివార్య కారణాలతో వేలంపాట వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు ఎక్సైజ్ అథారిటీ వారికి పూర్తి అధికారం కలదన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ షబ్బీర్

ప్రజాశక్తి - బంగారుపాలెం: మండలం తహశీల్దార్‌గా షబ్బీర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో విధులు చేపడుతూ బదిలీపై బంగారుపాలెం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ గతనెల ఉద్యోగ విరమణ పొందారు. నూతన తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది, డిప్యూటీ తహశీల్దార్ బాబు, మండల సర్వేయర్ లావణ్య స్వాగతం పలికారు.

జిల్లాస్థాయి టెస్టుకి ఆనిగానూరు విద్యార్థులు

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని ఆనిగానూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకి టెస్టులో జిల్లా స్థాయి టెస్టుకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య గురువారం తెలిపారు. విద్యార్థులు కార్తీక్, ఉదయశ్రీ, రమ్యశ్రీ రామకుప్పంలో జరిగిన మండల స్థాయి చెకుముకి టెస్టులో మొదటి స్థానాన్ని సాధించారన్నారు. దీంతో విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. యూనిట్ ఇంచార్జ్ రామ్మూర్తి, ఎస్ఎంసి చైర్మన్ బీరప్ప, శుభన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

ప్రజాశక్తి-సోమల: సదుం మహత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.భానుతేజ తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ తారకరామ స్టేడియం గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్ 17 అథ్లెటిక్స్ 400 మీటర్ల పోటీలో పాల్గొని రెండవ స్థానం సాధించి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ ఎంపిక పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్‌ను, క్రీడాకారుడిని, ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

పాఠశాలకు సీసీ కెమెరాలు వితరణ

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సదుం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ రెండు సీసీ కెమెరాలను విరాళంగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమ సుధాకర్ తెలిపారు. ఇటీవల కాలంలో పాఠశాల క్రీడామైదానంలో, తరగతి గదుల సముదాయం పరిసర ప్రాంతాలలో అల్లరి మూకలు మద్యం తాగడం, పచ్చని చెట్లను విరిచివేయడం, పాఠశాల ఆస్తులకు నష్టం కలిగించడం వంటివి చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న సత్యనారాయణ సీసీ కెమెరాలు విరాళంగా అందజేసి తన ఔదార్యం చాటుకున్నారని హెచ్ఎం తెలిపారు. కెమెరాలను త్వరలో బిగించి అల్లరి మూకల ఆటలు కట్టించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత

ప్రజాశక్తి - శాంతిపురం: మండల పరిధిలోని రాళ్లబూదుగూరు గ్రామపంచాయతీలో కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏజేంద్ర కుమార్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి శివ శంకరయ్య, సర్పంచ్ లక్ష్మి మురుగేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై కళాజాత రూపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కళాకారుల చేత పాటలు, నృత్యాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. రాళ్లబూదుగూరు యూనిట్ ఇంచార్జ్ ఆర్ఎస్.మని, టిడిపి నాయకులు జయరాజ్, కుమార్, శివన్న, నారాయణ పాల్గొన్నారు.

సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ

విద్యార్థులను నుండి సమాధానాలు రాబడుతున్న ఎంఈఓ

ప్రజాశక్తి-సోమల: ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి వారితో చదివించి పదాలు, పద్యాలు, వాక్యాలను చదివి వినిపించుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యంగా రుచికరంగా వండిపెట్టాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాఠాలలో వెనుకబడిన విద్యార్థులను మొదటి స్థానంలో తీసుకువచ్చేందుకు మరింత కృషిని ఉపాధ్యాయులు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

కోడిగిత్తల హోరు.. యువత జోరు..

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: మండలంలోని కురపల్లె గ్రామంలో గురువారం జల్లికట్టు నిర్వహించారు. ఈసందర్భంగా కోడిగిత్తల పరుగు పందేలలో యువత ఉత్సాహంగా పాల్గొని పశువులకు కట్టిన పలకల్ని బహుమతులను సొంత చేసుకున్నారు. అనంతరం గెలుపొందిన ఎద్దులకు బహుమతులు పంపిణీ చేశారు.

పుంగమ్మ చెరువు రూపురేఖలు లేకుండా చేశారు

అభివృద్ధి అంటే అందిన కాడికి దోచుకోవడమే
అసెంబ్లీకి పోనోళ్ళకి ప్రోటోకాల్ అవసరమా..:టిడిపి ధ్వజం

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్ రాయల్

ప్రజాశక్తి- పుంగనూరు

గత 20 ఏళ్లుగా మీరు చేసిన అభివృద్ధి పుంగమ్మ చెరువు రూపు రేఖలు లేకుండా చేసిన ఘనత అది కూడ మీకే దక్కుతుందని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు మధుసూదన్ రాయల్ అన్నారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప టిడిపిపై చేసిన ఆరోపణలకు గురువారం పార్టీ కార్యాలయంలో ఘాటుగా స్పందించారు. పుంగనూరు మున్సిపాలిటీలో పదుల సంఖ్యలో బోర్లు వేశారని వాటిలో ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయని ప్రశ్నించారు. బోర్లు డీప్నింగ్ చేస్తామని మీరు బిల్లులు పెట్టి స్వాహా చేసిన వివరాలు చెప్పాలన్నారు. మోటర్లు ఒక కంపెనీ బిల్లు పెట్టి మరో కంపెనీవి బోరు మోటర్లకు దించింది చరిత్ర మీది కాదన్నారు. పది సంవత్సరాలు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని సప్లై చేసి కోట్ల రూపాయలు దోచుకున్నది మీరే అన్నారు. మినరల్ వాటర్ ఇస్తున్నామని చెప్పారే అవి ఎన్ని రోజులు ఇచ్చారు ఆ నీటిని కూడా మీ కార్యకర్తలు అమ్ముకున్నది అప్పుడే మరిచిపోయారా! పుంగమ్మ చెరువు విషయానికొస్తే వాకింగ్ ట్రాక్ అంటూ మొదటిసారిగా ఉన్నప్పుడు 400ఎకరాలు పుంగమ్మ చెరువును 100 ఎకరాలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి ఉపయోగించుకుంది మీరు కదా.. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఇప్పుడు ఎంతవరకు ఉపయోగపడుతున్నది మీరే జవాబు చెప్పాలన్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని 50 ఎకరాలు వృథా చేసింది మీ పార్టీ కాదా అని చెప్పారు. ప్రోటోకాల్ విషయానికొస్తే అసెంబ్లీకి వెళ్ళిన ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ మాత్రం కావాలా అని అడగడానికి మీకు సిగ్గు లేదా అన్నారు. మొదట మీ ఎమ్మెల్యేని శాసనసభకు వెళ్ళమని చెప్పండి తరువాత ప్రోటోకాల్ గురించి మాట్లాడండి. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ వచ్చినప్పుడు చైర్మన్, కౌన్సిల్ సభ్యులు వెళ్లి సమస్యలు తెలపాలి కానీ విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో వెంకటేష్, సుబ్రహ్మణ్యం, గంగరాజు, వెంకటరమణ, సంజీవి, అనిల్, సయ్యద్, సర్వీస్, అప్రోజ్, నూర్ష, ముజ్జు, మునినాథ, సిద్దన్న, సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని 7వ తేదీ నిర్వహించినట్లు ఎంపీడీవో మనోహర్ గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు గంగాధర నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు వైస్ ఎంపీపీలు, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు. అధికారులు ఆయా శాఖలకు చెందిన నివేదిక వివరాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో గురువారం సీజనల్ వ్యాధులు, వ్యక్తి గత పరిశుభ్రత, బాలికలు పాటించాల్సిన ఆరోగ్య సూచనలు డాక్టర్ పద్మావతి తెలియజేశారు. అలాగే డిప్యూటి హెచ్ఈవో కాంతమ్మ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కలింపచారు. బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. ప్రిన్సిపాల్ సత్య సుప్రజ, సీఎచ్ఓ సాయి దివ్య, నాగేశ్వరి, రాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కుప్పం: భవ్య హెల్త్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ టెస్టులను ప్రతిఒక్కరు చేయించుకోవాలని కౌన్సిలర్ జాకీర్ పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ 18వ వార్డులో గురువారం రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఒకసారి రక్త పరీక్ష చేయించుకుంటే 49 రిపోర్ట్స్ ఇవ్వడం జరుగుతుందని దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- యాదమరి: ప్రతి విద్యార్థి పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రమేష్ తెలిపారు. గురువారం మండలంలోని పెరుమాళ్ళపెంట ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలకు ప్రభుత్వం అందించే నిధులు, పథకాలను వినియోగించాలన్నారు. శుభ దిన్ భోజనంను చైర్మన్ రాజశేఖర్ పిల్లలకు తల్లిదండ్రులకు అందించారు. ఉపాధ్యాయులు మోహన్ కుమార్, నాగేశ్వరశెట్టి, మూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: అపోలో ఆసుపత్రి సహకారంతో గ్రామీణ ప్రజల వైద్యసేవలు కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ చిరంజీవి రెడ్డి తెలిపారు. గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం గ్రామంలో గురువారం అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 103 మంది రోగులకు వివిధ పరీక్షలు చేసి మందులు మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, మాజీ మండల సర్పంచులు సంఘం అధ్యక్షుడు అశోక్ నాయుడులు డాక్టర్ చిరంజీవి రెడ్డిని శాలువ కప్పి సన్మానించారు.

రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ చిరంజీవి రెడ్డి

యూరియా పంపిణీ

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ఉన్నిగానిపల్లి పంచాయతీ రైతుసేవా కేంద్రంలో కూటమి నేతలు గురువారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా కొరత అధికంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడకుండా చొరవ తీసుకున్నామన్నారు. మాజీ సర్పంచ్లు రామ్మూర్తి, మహేంద్ర నాయుడు, రామలింగం, బీరప్ప, మంజునాథ్, సుబ్రహ్మణ్యం, రాజప్ప పాల్గొన్నారు.

16న మాల మహానాడు సభ

ప్రజాశక్తి- పుంగనూరు: ఈనెల 16వ తేదీ జరిగే మాల మహానాడు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని నియోజకవర్గ నలుమూలల నుండి కార్యకర్తల తరలిరావాలని రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.అశోక్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో మహాసభను జయప్రదం చేయాలని గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న మదనపల్లిలో సిఎస్ఐ ఫంక్షన్ హాల్‌లో మహాసభ జరుగుతుందని, ఈసభకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శంకర, అఖిల్, ఏడూరు సీన గంగప్ప, జెవి.నాగరాజ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని జీటీ కండ్రిగ, చవటగుంట గ్రామాల్లో గురువారం మెడికల్‌కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, మండల అధ్యక్షులు కామసాన్ని పద్మనాభ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొని సంతకాల సేకరణ చేశారు.

గురుకుల పాఠశాలలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలం పరిధిలోగల కమ్మనపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాలలను గురువారం ఎంపిడిఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈవో 1 జనార్ధన్ రెడ్డి, ఎంఈవో 2 సుబ్రహ్మణ్యంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య సుప్రజను విచారించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎం మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా విద్యార్థులకు చిన్నపాటి అలర్జీ సమస్యలు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే డాక్టర్లను పిలిపించి వైద్యం చేయించామని ప్రస్తుతం వారు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు వర్షాల నేపథ్యంతో తమకు వేడినీళ్ల సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ, ఎంఈవోలు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కోరారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో గురువారం మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్నతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ డీఈఈగా కొత్తగా విధుల్లో చేరిన జిఎస్ వినోద్‌కుమార్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు పాలకవర్గంతో కలిసి సమన్వయంతో పనిచేసి పలమనేరు మార్కెట్‌ను అన్ని విధాల అభివృద్ధి చేయాలన్నారు. త్వరలోనే పట్టణ సమీపంలోని కేటిల్ ఫామ్ వద్ద 33 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. మార్కెట్లో అభివృద్ధికి సంబంధించి ఏదైనా సమస్యలున్న నిధులు అవసరమున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ అభివృద్ధిలో అధికారులు, పాలకవర్గం ఏమాత్రం రాజీ పడకుండా వీలైనంత త్వరగా మంచి సౌకర్యాలతో కూడిన మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ సంజీవ్, సైట్ ఇంజనీర్ గౌస్, సిబ్బంది ఉన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తాం..

విశ్రాంతి డీఎస్పి సుకుమార్ బాబు

ప్రజాశక్తి- పుంగనూరు: శుభారామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేస్తామని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, విశ్రాంతి డీఎస్పి సుకుమార్ బాబు అన్నారు. డిగ్రీ కళాశాల ఆవరణంలో కొత్త విద్యార్థుల స్వాగత దినోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుకుమార్ బాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నూతనంగా డిగ్రీ కళాశాల ప్రారంభమైందన్నారు. ఈ కళాశాలలో ఎంతోమంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వం ప్రహరీ గోడ కడతామని ఇంతవరకు ఏమి చేయలేదని ఆరోపించారు. ఈ సంవత్సరం చల్లా బాబుతో మాట్లాడి విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు దగ్గరికివెళ్లి కళాశాల ప్రహరీ గోడ, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రయత్నిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్ మాట్లాడుతూ డిగ్రీ కాలేజ్‌కు క్రికెట్ కిట్టు, స్పీకర్ మైకులు టెన్నికాయిట్ అందించిన సుకుమార్ బాబు డిగ్రీ కాలేజీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పుదీపట్ల సర్పంచ్ రెడ్డప్ప రెడ్డి మాట్లాడుతూ శుభారామ్ డిగ్రీ కాలేజీకి తన తరపున జనరేటర్ అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాశేఖర్, బసవరాజా, మహిళా జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఆర్యవైశ్య తెలుగుదేశం నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంతి డీఎస్పి సుకుమార్ బాబు

రైతులకు అందుబాటులో వర్మీ కంపోస్ట్ ఎరువులు

ప్రజాశక్తి- వి.కోట: వి.కోట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న చెత్త నుండి సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు వి.కోట గ్రామపంచాయతీ ఈవో నరేష్ తెలిపారు. వర్మీ కంపోస్ట్ ఎరువుల వాడకం వలన పంటలకు భూసారం పెరిగి ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని తెలిపారు. ఇలాంటి జీవసాంద్రీయ ఎరువులు వాడకం వలన భూమిలోని జీవధాతువులు అభివృద్ధి చెంది నిస్సారమైన భూమి సారవంతం అవుతుందని తెలిపారు. ఎరువులు కావలసిన రైతులు వి.కోట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్ణీత ధరను చెల్లించి ఎరువులను పొందవచ్చునని తెలిపారు.

సహకార సంఘంలో రుణాలు మంజూరు

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ చిత్రానాయుడు తెలిపారు. గురువారం యాదమరి సహకార సంఘం కార్యాలయంలో దలవాయిపల్లి గ్రామపంచాయతీ నూరునగర్ గ్రామానికి చెందిన రెండు కుటుంబాల వారికి రూ. 8లక్షలు రుణాలను మంజూరు చేశారు. ఈసందర్భంగా ఛైర్‌పర్సన్ చిత్ర మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు, గృహాలు, పెళ్లిళ్లకు రూ.5లక్షల వరకు సహకార సంఘం ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గతంలో తీసుకుని వాయిదా మీరిన రుణాలను సక్రమంగా చెల్లించి సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. కమ్మపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకి మంజూరైన చెక్కును అందజేశారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్.గుణశేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్లు మహబూబ్‌బాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.



12వ పిఆర్‌సి కమిషన్ నియమించండి

ప్రజాశక్తి- చిత్తూరు 9యాదమరి): 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) ఆధ్వర్యంలో ఐరాల మండలంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం పొలకల, నాంపల్లి, బీరప్ప చెరువు, ఐరాల, పైపల్లె, అగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు జరిగింది. జిల్లా శాఖ అధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ చైర్ పర్సన్‌ను నియమించి మధ్యంతర భృతి 30శాతం తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.35వేలకోట్లు దశలవారీగా మంజూరు చేయాలని, రిటైర్మెంట్ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, సరెండర్ లీవు బకాయిలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు పురుషోత్తం, నాయకులు కిషోర్ కుమార్‌రెడ్డి, హరినాథ్, సుధాకర్, గుణశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఇద్దరు మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని బండ్లదొడ్డి గ్రామానికి చెందిన కన్నయ్య కుమారుడు రామరాజు (32) బలాజిపల్లి క్రాస్ వద్ద ఉండగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆదివారం రాత్రి బండ్లదొడ్డి గ్రామం సమీపంలో మామిడి తోటలో వన్యమృగాల కోసం విద్యుత్తు అమర్చగా ఆ ఉచ్చులో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, అడవి పంది పడి మృతి చెందడంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. రామరాజుపై అనుమానం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. నిందితుడుతు అంగీకరించడంతో అతనిపై విద్యుత్ చోరీ కేసు, వన్యమృగాల వేట కేసు, ఇద్దరు వ్యక్తులు మృతికి కారణమైన కేసు నమోదు చేసి కోర్టుకు తరలించి జైలుకు పంపినట్లు పోలీసులు తెలిపారు. గ్రామ వీఆర్వోలు హేమచంద్ర, రామకృష్ణ హెడ్ కానిస్టేబుల్ అస్గర్ పాల్గొన్నారు.

నడుమూరు ఘాట్‌లో ప్రమాదం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం– క్రిష్ణగిరి జాతీయ రహదారిలోని నడుమూరు ఘాట్ రోడ్డులో రెండు కంటైనర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి వైపు నుండి వస్తున్న కంటైనర్ కుప్పం వైపు నుండి వెళ్తున్న మరో కంటైనర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ కిషోర్ దేవ్ తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. నడుమూరు మోడల్ స్కూల్ వద్దనున్న మలుపులో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ కార్యకర్త జశ్వంత్ మృతి పట్ల ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంతాపం వ్యక్తం చేశారు. చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి గ్రామ పంచాయతీ ఒంటిల్లు కృష్ణాపురం గ్రామానికి చెందిన టిడిపి బూత్ కో కన్వీనర్ జశ్వంత్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గురువారం ఎమ్మెల్యే జశ్వంత్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఆర్థిక సాయం అందించారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- సోమల: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాలలో విస్తృతంగా పర్యటించి వ్యాప్తి చెందే అంటువ్యాధుల పట్ల, దోమల వలన వచ్చే డెంగీ, మలేరియా, వంటి జ్వరాలపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల సూచించారు. గురువారం సోమల మండలం పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ల్యాబ్‌లోని పరికరాలు, మందుల నిల్వను రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి జయసింహ సిహెచ్ఓ అమర్నాథ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి- సోమల : చిత్తూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరపున 35వ సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను సదుం పోలీస్ క్రీడమైదానంలో నిర్వహించినట్లు చిత్తూరు జిలా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు మమతారెడ్డి తెలిపారు. ఈఎంపిక పోటీలను సీనియర్ కబడ్డీ జాతీయ క్రీడాకారులు ఆంజనేయులు శ్రీనివాసులు, గుల్జార్, పవిత్ర, రుక్సానా, నౌషాద్ ఆధ్వర్యంలో పారదర్శకంగా ఎంపిక చేశారు. పోటీలకు సుమారు బాలికలు 60 మంది, బాలుర విభాగంలో 86 మంది క్రీడాకారులు తమ ప్రతిభను చూపినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజర్ కార్యదర్శి రవీంద్రరెడ్డి తెలియజేశారు. బాలుర విభాగంలో 15 మంది బాలికల విభాగంలో 15 మంది క్రీడాకారులను ఎంపిక చేయగా వీరు ఈ నెల7 నుండి 9వ తేదీ వరకు కడప జిల్లా బద్వేల్‌లో జరుగే 35వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారనీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రవీంద్రరెడ్డి తెలిపారు.

ప్రత్యేక పూజలో రష్యా దేశస్తులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన అల్లిఎల్లమ్మ తల్లి ఆలయంలో రష్యా దేశస్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతదేశ పర్యటనలో భాగంగా రష్యా దేశానికి చెందిన పది మంది విదేశీయులు సాంప్రదాయ దుస్తులు ధరించి గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని అల్లి ఎల్లమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో నాగప్రతిష్ట, నాగహోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మాజీ ధర్మకర్త రవీంద్రారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేటూరులో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి- సోమల: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో మండలంలోని పేటూరు గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 195 పశువులకు పిడుదుల మందు పిచికారి, 32 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ, 34 పశువులకు గర్భకోస వ్యాధి నివారణ చికిత్సలు అందజేసినట్లు వైద్యాధికారిని చందన ప్రియ తెలిపారు. సోమల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పొదుగు వాపు వ్యాధి నివారణ, ఏడాదికో దూడ, దూడలలో పోషణపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్య సిబ్బంది వెంకటరమణ, అరుణ, రామకృష్ణ, సురేంద్ర, బాలకృష్ణ, మధు పాల్గొన్నారు.

కందూరులో పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామపరిధిలోని గ్రామాలలో రెండు రోజులుగా పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి దోమల అభివృద్ధికి కారకాలుగా మారాయిని దీంతో ఆటు మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం పిచ్చి మొక్కలు తొలగించడం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించి తడి, పొడి చెత్తను వేరుగా చేసి చెత్తసేకరణ వాహనంలో వేయాలని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.